క్లుప్తంగా

మోదీ పాలనలో విశేష అభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు

పెదగంట్యాడ: నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. ప్రధాని మోదీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పెదగంట్యాడలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు రోహిణి, జీలకర్ర భువనేశ్వరి, గిరికిన మాధవి, పేర్ల అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, మెషినిస్ట్, పెయింటర్, వెల్డర్, ప్లంబర్, టర్నర్, మేసన్, షీట్‌మెటల్ ట్రేడ్‌లలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా ఆన్‌లైన్‌లో తిరిగి దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల జులై 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులు దరఖాస్తులో 'కాస్ట్ కాలమ్'లో 'ఎస్పీ' అని టైప్ చేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జులై 21న ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్రలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తన సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వడానికి ఇబ్బంది ఏంటి ?

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల వివరాలు, కారుణ్య నియామకాలు, బీమా సంస్థలకు సమర్పించిన పత్రాల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని ఆర్టీఏ కార్యకర్త పట్టా రామ అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కర్మాగారంలో విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మికులకు నష్టపరిహారంతో పాటు కారుణ్య నియామకాలు కల్పించాలని, అయితే యాజమాన్యం అనేకమంది విషయంలో అన్యాయంగా వ్యవహరించి, కార్మికుల కుటుంబాలకు తీవ్ర ద్రోహం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాట్ర తాతారావు, సీతిన అచ్చుతరావు, గొడ్డి అప్పారావు మరణాల విషయంలో యాజమాన్యం మూడు నెలల నుంచి వివరాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తుందని, దీనివల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా చితికిపోయాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీతిన లక్ష్మి, గొడ్డి నాగమ్మ, నిమ్మకూరి రమేష్ పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

సమన్వయలోపం విద్యార్థులకు శాపం

- అగమ్యగోచరంగా ఉక్కు విశాఖ విమల విద్యాలయం భవిష్యత్తు
- ప్రారంభంకాని తరగతులు
- ఏటా ఇదే పరిస్థితి
- స్టీల్‌ప్లాంట్ నిర్ణయం కోసం ఎదురుచూపులు

విశాఖ విమల విద్యాలయం





పాఠశాల ముందు ధర్నా చేస్తున్న కార్పొరేటర్, నాయకులు

ఉక్కునగరం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిధిలోని విమల విద్యాలయం (వీవీవీ) భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం డయాసిస్ ఆఫ్ రోమన్ క్యాథలిక్ మిషనరీ సంస్థల మధ్య సమన్వయం లోపించడంతో, ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమైనా, వీవీవీ ఇంకా తెరుచుకోలేదు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి ఏర్పడటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

సుమారు 40 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ సామాజిక బాధ్యతగా నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు, బలహీన వర్గాల కోసం ఈ పాఠశాలను స్థాపించింది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సహాయంతో, నామమాత్రపు ఫీజులతో ఇది నడుస్తోంది. ప్రస్తుతం 1700 మంది విద్యార్థులు, 52 మంది ఉద్యోగులు (శాశ్వత, అవుట్‌సోర్సింగ్, నాన్-టీచింగ్) ఉన్నారు. ఉక్కు యాజమాన్యం ఏటా రూ. 4.5 కోట్లు ఖర్చు చేస్తుండగా, విద్యార్థుల ఫీజుల ద్వారా రూ. 2 కోట్లు వస్తోంది. మిగిలిన రూ. 2.5 కోట్లు స్టీల్‌ప్లాంట్ భరించాల్సి ఉంది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎంఓయూ (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) గడువు ముగియడం, స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో గతేడాది నుంచి ఈ సమస్య తలెత్తింది.

ప్రస్తుత పరిస్థితి

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఫీజులు పెంచి పాఠశాలను స్వయంగా నిర్వహించుకోవాలని సూచిస్తుండగా, డయాసిస్ సంస్థ అది సాధ్యం కాదని, స్టీల్‌ప్లాంట్ ఆమోదం లేకుండా నడపలేమని అంటున్నాయి. దీనివల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తమ తరగతులు జరగకపోతే భవిష్యత్తు ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ప్రజా ప్రతినిధుల జోక్యం

ఈ అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు తెలుపుతున్నారు. వార్డు కార్పొరేటర్ బి. గంగారావు ఆధ్వర్యంలో గురువారం పాఠశాల వద్ద ధర్నా చేశారు. ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు సమస్యను వివరించగా, ఆయన తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంపైనే పాఠశాల భవిష్యత్తు ఆధారపడి ఉంది.



పాఠశాల ప్రిన్సిపాల్‌ను వేడుకుంటున్న విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేలా ఒత్తిడి తేవాలి

విశాఖ విమల విద్యాలయం నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది ఒత్తిడితో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తాత్కాలికంగా పాఠశాల నిర్వహణకు అంగీకరించినా, ఈ ఏడాది సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ ఊగిసలాట ఎన్నాళ్లు కొనసాగుతుందోనని పాఠశాల వర్గాలు కలవరం చెందుతున్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందించే ఈ పాఠశాల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యంతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాత పద్ధతిలో పాఠశాల నిర్వహించాలి



స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుమతితో తమను నియమించారు. తమకు ఎన్నో అవకాశాలు వచ్చినా ఇక్కడే కొనసాగాం. ఉద్యోగుల పిల్లలు వేలాది మంది ఇక్కడ చదువుకున్నారు. ఇప్పుడు ఉద్యోగుల పిల్లలు తక్కువ ఉన్నారని పాఠశాలను నిలిపివేస్తే ఉపాధ్యాయులుగా మా పరిస్థితి ఏమవ్వాలి. పాత పద్ధతిలో పాఠశాలను నిర్వహించాలి.

– బి.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

మా చదువుల పరిస్థితి ఏంటి



9వ తరగతి వరకు ఇక్కడే చదివాం. ఇప్పుడు 10వ తరగతికి వచ్చా. 10 రోజులుగా తరగతులు జరగడం లేదు. ఇక్కడ నుంచి వేరే పాఠశాలకు వెళ్తే తమ పరిస్థితి ఏంటి. మేము ఎలా పరీక్షలు రాయగలం. వెంటనే తరగతులు ప్రారంభించండి ప్లీజ్.

– భార్గవి, 10వ తరగతి విద్యార్థిని

యోగా నిర్వహణలో విశాఖను చరిత్ర పుటల్లో నిలుపుదాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

గాజువాక : ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విశాఖను చరిత్ర పుటల్లో నిలిపే విధంగా అందరూ కృషి చేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ కోరారు. యోగాంధ్ర నిర్వహణపై గాజువాకలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు సమాజంలో సానుకూల మార్పులను తీసుకురావచ్చన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరూ సంసిద్ధమయ్యారన్నారు. అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.7,500 ఇవ్వాలి

గాజువాక : ఈపీఎఫ్ 95 ప్రకారం పెన్షన్ తీసుకొంటున్న విశ్రాంత ఉద్యోగులకు రూ.7,500 కనీస పెన్షన్‌ను డీఏతో జత చేసి ఇప్పించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించాలని వైజాగ్ నేషనల్ ఏజిటేషన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గాజువాక పర్యటనకు విచ్చేసిన విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను కలిసి తమ డిమాండ్లపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విశ్రాంత ఉద్యోగుల భార్య, భర్తలకు హెల్త్ కార్డులను ఇప్పించాలని కోరారు. తమ సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో ఏజిటేషన్ కమిటీ ప్రతినిధులు ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు, ఉరుకూటి అచ్చిలినాయుడు, బెల్లాల నాగేశ్వరరావు తదితరులున్నారు.

సమష్టిగా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ నూతన హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావు పిలుపునిచ్చారు. హెచ్‌ఆర్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ నాయకులు ఆయనకు శాలువా కప్పి, బొకేతో అభినందించారు. త్వరలో బీఎఫ్-3 (బ్లాస్ట్ ఫర్నేస్-3) ప్రారంభం కానున్న నేపథ్యంలో, పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే స్టీల్‌ప్లాంట్ తప్పకుండా లాభాల బాట పడుతుందని మధుసూదనరావు ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ఏను పునరుద్ధరించాలని వారు ఆయనను కోరారు. ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్ నల్లి సుందరం, బి. అరవింద కుమార్, ఎం వీ సత్యనారాయణ, కుంచె సత్యనారాయణ, నడుపూరు వెంకన్న, ఎస్. రమేష్‌కుమార్, కృష్ణకుమార్, జగ్జీవన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇటీవల తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం గాజువాకలో ఎంపీ ఎం.వి. శ్రీభరత్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఉక్కు యాజమాన్యం ఇప్పటికే సుమారు 3 వేలకు పైగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందని, దీంతో వేలాది మంది రోడ్డున పడ్డారని నాయకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడిన ఈ కార్మికుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని వారు కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ స్పందిస్తూ త్వరలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌తో కలిసి మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి స్థానికంగా ఉన్న నిర్వాసిత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులైన పీవీ నగేష్, వంశీకృష్ణ, మంగరాజు, రమణ, కె. నూకరాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో శునకాల బెడద



సాగర తీరంలో శునకాల బెడద తప్పడం లేదు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అధికారులకు శునకాల సంచారం తలనొప్పిగా మారింది. గురువారం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన యోగా సాధన కార్యక్రమం మధ్యలో పలు శునకాలు యథేచ్ఛగా సంచరించాయి. దీంతో మహిళలు భయపడిపోయారు. ప్రశాంతంగా యోగా సాధన చేసే సమయంలో వీటి సంచారం కొంత ఇబ్బందిగా మారుతోంది. జీవీఎంసీ సిబ్బంది కుక్కలను కట్టడి చేయడానికి ఎంత ప్రయత్నిస్తున్నా.. అవి మళ్లీ దర్శనమిస్తున్నాయి. ప్రధాని పాల్గొనే సమయంలో ఇటువంటి శునకాలు సంచరిస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

యోగాలో భాగస్వాములు కావాలి



యోగాసనాల్లో స్థానికులు

అగనంపూడి: ఈ నెల 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖలో నిర్వహించనున్న 'యోగాంధ్రా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు పిలుపునిచ్చారు. అగనంపూడిలోని దుర్గమాంబ ఆలయ ఆవరణలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిత్తా రామారావు మాట్లాడుతూ యోగాను ప్రతి మనిషి జీవితంలో నిత్యకృత్యంగా మార్చుకోవాలని ఉద్ఘాటించారు. ప్రస్తుతం వాయువు, నీరు, ఆహారంతో పాటు మనుషుల మనసులు కూడా కలుషితమవుతున్న తరుణంలో యోగా, ధ్యానంతోనే మానవాళి ఉపశమనం పొందగలదని పేర్కొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

'యోగాంధ్రా' కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ స్థానికులు జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దేశంలోనే గర్వించదగిన స్థాయిలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుతున్నారని, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయానికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కె.హనుమంతురావు, బి.సత్యనారాయణ, ఎస్.లక్ష్మి, జి.రుద్రకుమార్, కె.జె.నాయుడు, గళ్ల హనిత తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో మదీనాబాగ్



అంధకారంలో మదీనాబాగ్ ప్రాంతం

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్ నుంచి జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అంధకారం అలుముకుంది. రహదారిలో వీధిలైట్లు లేకపోవడం, ఉన్నవి కూడా సాయంత్రం కాగానే వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటుంది. దీనివల్ల రోడ్డు దాటడం చాలా కష్టంగా మారి, నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. ముఖ్యంగా వాహనదారులు రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్లు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. కూలి పనుల నిమిత్తం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో చెట్లు, తుప్పలు అధికంగా ఉండటంతో పాముకాట్ల భయం కూడా వెంటాడుతోంది. జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మదీనాబాగ్, జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వాసులు కోరుతున్నారు.

యోగాంధ్ర ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్దనున్న యోగా ప్రధాన వేదిక, పార్క్ హోటల్ కూడలి, తెన్నేటి పార్క్, సీతకొండ, ఏ వన్ గ్రాండ్, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను, తాగునీరు, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుధ్య పనులు, లైటింగ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణ జరపాలని సూచించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్ల వద్ద తగినంత నీటిని ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలంతా రాత్రి వస్తున్నందున లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ప్రాంతంలో అధిక సంఖ్యలో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని, విశాఖ ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, కె.వి.ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్



ఆచార్య సాంబశివరావును సత్కరిస్తున్న ఆచార్య సుదర్శనరావు తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఎస్. సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్)లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఐఐపీఏ) విశాఖ ప్రాంతీయ కేంద్రం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఐఐపీఏ విశాఖ కేంద్రం చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ విశాఖలో ఉద్యోగుల జీవన నాణ్యతపై ఉద్యోగుల సంక్షేమ పద్ధతుల ప్రభావం అనే అంశంలో పరిశోధనకు సాంబశివరావు ఎంపికయ్యారని తెలిపారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం నుంచి 2024-26 సంవత్సరానికి ఈయన ఒక్కరే ఎంపికవడం విశేషమన్నారు. ఐఐపీఏ కార్యదర్శి ఆచార్య పీటీటి ప్రేమానందం మాట్లాడుతూ ఇలాంటి ఫెలోషిప్‌లకు ఏయూ ఆచార్యులు ఎంపికవడం వర్సిటీకి జాతీయస్థాయిలో మంచి గుర్తింపును తెస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఐపీఏ సభ్యులు ఆచార్య షమీం, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బాక్సింగ్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు బాక్సింగ్ కిట్లు అందిస్తున్న మాజీ హవల్దార్ చిరంజీవి రెడ్డి, రావ్

సింధియా: సింధియా జై భీమ్ బాక్సింగ్ క్రీడాకారులకు ఆర్మీ మాజీ హవల్దార్ చిరంజీవి రెడ్డి బాక్సింగ్ కిట్లు అందజేశారు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించిన మహిళా బాక్సర్ ధనుశ్రీకి ప్రోత్సాహక బహుమతిని అందించారు. జై భీమ్ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు గుర్రాల రామారావు మాట్లాడుతూ క్రీడాకారులకు సహాయం అందించిన చిరంజీవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యు.వి. రావ్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కైవసం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ క్రీడాకారులు చందు, డ్యాన్సర్ గణేష్, రాబిన్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు

ఆరిలోవ: యోగాంధ్ర సందర్భంగా నగరంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. హైవేపై ఎండాడ నుంచి నగరం వైపు వెళ్తున్న వాహనాలు బారులు తీరుతున్నాయి. కూడళ్లలో ఎర్ర బల్బు వెలిగిందంటే వందల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారిపై గురువారం డెయిరీ ఫారం కూడలి నుంచి హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ఉదయం నుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. బీచ్ రోడ్డులోకి వాహనాలు వెళ్లకుండా ఆపేశారు. దీంతో బీచ్ రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు సైతం హైవేపైకి మళ్లుతున్నాయి. ఎండాడ, జూ పార్కు, డెయిరీఫారం, హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ట్రాఫిక్ రద్దీ పెరిగింది. బుధవారం కూడా హనుమంతవాక నుంచి అటు డెయిరీ ఫారం, ఇటు వెంకోజీపాలెం వరకు వాహనాలతో రోడ్డు కిక్కిరిసింది. సుమారు కిలోమీటర్ దూరం ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పడుతోంది.

బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధంపై పేటెంట్



పరిశోధనా బృంద సభ్యులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్‌బాబు, పరిశోధనా బృందం అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి ఒక గొప్ప విజయం సాధించారు. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాఫ్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 ఏళ్ల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ క్యాన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటంతో పాటు డ్రగ్-రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉందని పరిశోధనా బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈ బృందాన్ని ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ కిషోర్‌బాబు అభినందించారు. ఈ విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు పేర్కొన్నారు.